
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 18 । జులై । 2025



సోమశిలలో 28 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 28 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4525 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,096
3 శాతం జీఎస్టీతో	రూ.9,369
నవర (8 గ్రా)	రూ.74,952

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.2 /25.8

జిల్లాలో అక్కడక్కడా శుక్రవారం వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 63 శాతంగా గురువారం నమోదైంది.



డంపింగ్ యార్డు కాదు.. ముంగమూరివారి వీధే..



మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఇలా..



తిప్పరాజువీధిలో అపరిశుభ్ర వాతావరణం



కృష్ణ మందిర వీధి.. చెరువును తలపిస్తూ..

ఇక్కడ అధ్వానం.. అక్కడ అవార్డులా..?

సింహపురిలో పారిశుధ్యం దయనీయంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దర్శనమిస్తోంది. సాక్షాత్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ దుస్థితి తలెత్తుతోందంటే ఆశ్చర్యం కలగకమానదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనూ నెల్లూరు నగరపాలక సంస్థ తీరు అంతంతమాత్రమే. మరోవైపు ఈ అవార్డుకు రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, తిరుపతి, గుంటూరు నగరాలు ఎంపికయ్యాయి. ఢిల్లీలో ఈ పురస్కారాన్ని అమాత్యుడు గురువారం అందుకున్నారు. సొంత నగరాన్ని గాలికొదిలి.. పక్క సిటీలకు వచ్చిన అవార్డులను తన ఖాతాలో వేసుకున్న ఆయన తీరుపై నెల్లూరులో విస్మయం వ్యక్తమవుతోంది.

– నెల్లూరు(బారకాసు) ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

న్యూస్‌రీల్

సురేష్‌కుమార్‌రెడ్డికి ముందస్తు బెయిల్

నెల్లూరు (లీగల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బచ్చలపల్లి సురేష్‌కుమార్‌రెడ్డికి కండిషన్లతో కూడిన ముందస్తు బెయిల్‌ను మంజూరు చేస్తూ గూడూరు ఏడో అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వెంకటనాగపవన్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. గత ఎన్నికలకు ముందు పొదలకూరు మండలం విరువూరులో అక్రమ మద్యం నిల్వలను ఉంచారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ తరుణంలో ముందస్తు బెయిల్ కోరుతూ తన న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, విజయకుమారి, సిద్దన సుబ్బారెడ్డి ద్వారా గూడూరు ఏడో అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు ఉన్న న్యాయమూర్తి షరతులతో కూడిన ముందస్తు బెయిల్‌ను మంజూరు చేశారు. రూ.పది వేల చొప్పున ఆస్తి కలిగిన ఇద్దరితో పూచికత్తు ఇవ్వడంతో పాటు పోలీసుల విచారణకు సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు (పొగతోట): జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని సీఈఓ మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, డ్వామా, డీఆర్డీఏ, జిల్లా విద్యా, విద్యుత్ శాఖలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారని వివరించారు. జెడ్పీ సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల ధర్నా నేడు

నెల్లూరు (టౌన్): సీపీఎస్ అమల్లోకి రాక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియమితులైన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నాను శుక్రవారం నిర్వహించనున్నామని డీఎస్సీ – 2003 ఉపాధ్యాయుల ఫోరమ్ జిల్లా కన్వీనర్లు సుబ్బయ్య, ప్రసాద్, ఉస్మాన్, భాస్కర్, కృష్ణ, విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఈ విషయంలో తాత్సారం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక మోసాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు రూరల్: ఆర్థిక మోసాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్బీఐ సీజీఎం సుబ్బయ్య పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో అవగాహన సమావేశాన్ని యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో హుస్సేన్ సాహెబ్ మాట్లాడారు. ఆర్థిక మోసాల నుంచి ఎలా కాపాడుకోవాలనే అంశాలపై అవగాహన సదస్సులను ఆర్బీఐ నిర్వహిస్తోందని చెప్పారు. అనంతరం సుబ్బయ్య మాట్లాడారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే గుర్తుతెలియని లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దని సూచించారు. సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930, బ్యాంక్ సేవల్లో లోపాలపై ఫిర్యాదులను టోల్ ఫ్రీ నెంబర్ 14448కు తెలియజేయొచ్చని ఆర్బీఐ డీజీఎం కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఎల్డీఎం మణిశేఖర్, ఆర్బీఐ ఏజీఎం బాలతేజ, యాక్సిస్ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంగీతాసింగ్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంతస్తులు

నెల్లూరు నగరం నలువైపులా విస్తరిస్తోంది. సింహపురికి వలసొచ్చే వారి సంఖ్యా నానాటికీ పెరుగుతోంది. ఈ తరుణంలో భవనాలను ఎడాపెడా నిర్మించేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా అంతస్తులనూ నిర్మిస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండ ఉందనే ధీమాతో పలువురు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన నగరపాలక సంస్థ అధికారులు తమకెందుకులేననే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఫలితంగా వీరి ఆగడాలు శ్రుతిమించుతున్నాయి.

- అనధికార లేఅవుట్లో భవన నిర్మాణాలు
- ప్రజాప్రతినిధుల అండతో బరితెగిస్తున్న పలువురు యజమానులు
- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- సింహపురిలో ఇదీ తంతు

నెల్లూరు(బారకాసు): మినీబైపాస్ చుట్టుపక్కల ప్రాంతాలు రోజుకోజుకూ అభివృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా అక్కడ అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాళ్లు వెలిశాయి. ఈ తరుణంలో బహుళ అంతస్తుల భవనాలను అక్రమంగా నిర్మించి ఎంత దోచుకుందామాననే రీతిలో పలువురు వ్యవహరిస్తున్నారు.

వ్యవహారమిలా..

టీడీపీ కార్యాలయ సమీపంలో ఐదెకరాల్లో ఓ లేఅవుట్‌ను గతంలో అనధికారికంగా వేశారు. దీనికి నుడా నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదు.



అనధికార లేఅవుట్లో వెలసిన భవనాలు

పైగా ఇందులో ఇరిగేషన్‌కు చెందిన 30 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందని సంబంధిత శాఖాధికారులే నిర్ధారించి కలెక్టర్‌కు నివేదికనూ అందజేశారు. అయినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అదునుగా భావించిన సదరు లేఅవుట్ యజమాని ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇలా కొనుగోలు చేసిన వారు అందులో భవన నిర్మాణాలను ప్రారంభించారు. ప్రస్తుతం సదరు లేఅవుట్లో అపార్ట్‌మెంట్లు పదుల సంఖ్యలో వెలిశాయి. మరికొన్ని నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి.

దిక్కుతోచక.. తలలు పట్టుకుంటూ..

అనధికార లేఅవుట్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నేడు నిర్మాణాలను సాగించాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికే కన్‌స్ట్రక్షన్ జరిపిన కొందరు ప్రస్తుతం ఏమి చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల పలుకుబడి ఉన్న వారు మాత్రం తాము ఏదోలా మేనేజ్ చేసుకోగలమనే ధీమాతో ఉన్నారు.

అంతులేని నిర్లక్ష్యం

వాస్తవానికి ప్లాన్ మంజూరు చేయించుకొని అనధికార లేఅవుట్లో అపార్ట్‌మెంట్లను నిర్మించినా, వాటిపై చర్యలు చేపట్టే హక్కు కార్పొరేషన్ అధికారులకు ఉంది. ఇలాంటివి పదుల సంఖ్యలో ఉన్నా, చర్యలకు వెనుకాడుతున్నారు. ఒకవేళ అక్రమ నిర్మాణమని తెలిసిన వెంటనే పరిశీలించి పునాదుల స్థాయిలోనే నిలిపేయాలి. అలా కాకుండా చివరి వరకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి.. నిర్మాణాలు పూర్తయ్యాక పరిశీలన నిమిత్తం వస్తున్నారు. ఆపై అనుమతి ఉందా.. లేకపోతే చర్యలు తప్పవంటూ బెదిరింపులకు దిగుతున్నారు. హైడ్రా వంటి చర్యలకు నగరపాలక సంస్థ అధికారులు ఉపక్రమిస్తే తప్ప ఇలాంటి ఆగడాలకు అడ్డుకట్ట పడే అవకాశం లేదు.

మంత్రి మాటలు నీటిమూటలేనా..?

అక్రమ నిర్మాణాలు, అనధికార లేఅవుట్లపై చర్యలు తప్పవని.. కూల్చేందుకైనా వెనుకాడబోమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పలు సందర్భాల్లో గతంలో స్పష్టీకరించారు. అయితే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే ఇదంతా ఒట్టిదేననే అంశం బహిర్గతమవుతోంది. నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మాత్రం నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నారు. సంబంధిత యజమానుల నుంచి ముడుపులు పుచ్చుకొని మౌనవ్రతం వహిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



నగరపాలక సంస్థ పరిధిలో అనుమతుల్లేకుండా భవనాలను అక్రమంగా నిర్మిస్తే చర్యలు తప్పవు. మినీబైపాస్‌లోని టీడీపీ కార్యాలయ సమీపంలో అనధికారికంగా లేఅవుట్‌ను ఏర్పాటు చేసిన వేసిన మాట వాస్తవమే. ఇందులో నిర్మాణాలు జరిపిన వారికి నోటీసులను జారీ చేశాం. చార్జిషీట్లనూ ఫైల్ చేశాం. లేఅవుట్‌కు సంబంధించిన వ్యవహారం కోర్టులో జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపడుతూనే ఉన్నాం.

– నందన్, కమిషనర్, నగరపాలక సంస్థ

కాకాణిపై ఆగని కక్షసాధింపు



- తాజాగా మరో అక్రమ కేసు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వ కక్షసాధింపులు ఆగడం లేదు. ఇప్పటికే పలు కేసులను మోపి వేధిస్తూ పైశాచికానందాన్ని పొందుతోంది. తాజాగా మరో అక్రమ కేసును తెరపైకి తీసుకొచ్చింది. గత ప్రభుత్వ హయాం 2021లో రెవెన్యూ అధికారుల తప్పిదాలపై నమోదైన భూ రికార్డుల మార్పిడి కేసులో ఈయన్ను నిందితుడిగా చేర్చడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

జరిగిందిదీ..

వెంకటాచలం మండలం కాకుటూరు రెవెన్యూ పరిధిలో ఆర్టీసీ జోనల్ కళాశాల ఎదురుగా సర్వే నంబర్లు 81 / 1, 2, 3, 5, 427లో 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 14.14 ఎకరాలను పట్టా భూమిగా మార్చేశారు. విషయం తెలుసుకున్న అప్పటి రెవెన్యూ అధికారులు వెంటనే విచారణ జరిపారు. వెంకటాచలం తహసీల్దార్ లాగిన్‌ను హ్యాక్ చేసి, గుడ్లూరు మండల డీటీ కీ ద్వారా ప్రవేశించి రికార్డులను తారుమారు చేశారనే అంశాన్ని గుర్తించారు. ఈ వ్యవహారంలో జిల్లా ఉన్నతాధికారులకు అప్పటి తహసీల్దార్ సమాచారం తెలియజేసి, వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ ఏడాదిలోనే కేసు నమోదు చేశారు. భూ రికార్డుల తారుమారులో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని అధికారులకు అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

ప్రశ్నించడాన్ని తట్టుకోలేక..

కూటమి సర్కార్ కొలువుదీరాక అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నిస్తుండటాన్ని ప్రభుత్వ పెద్దలు తట్టుకోలేకపోయారు. ఆయన గొంతు నొక్కే కుట్రల్లో భాగంగా కేసులపై కేసులు మోపుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇందులో భాగంగానే భూముల రికార్డుల మార్పిడి కేసులో కాకాణిని నిందితుడిగా చేర్చారనే ప్రచారం జిల్లాలో జరుగుతోంది.

వేలం కేంద్రంలో ఈడీ పరిశీలన

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ గురువారం సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు కంపెనీ ప్రతినిధులతో ముచ్చటించి.. అన్ని గ్రేడ్లను మంచి ధరలకు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలను ఆరాతీశారు. అధిక పంటకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అనుమతివ్వాలని.. ఎరువులను సరైన సమయంలో అందజేయాలని.. పంటకు బీమా వచ్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా విశ్వశ్రీ మాట్లాడారు. అధికంగా పండించిన పొగాకు విక్రయాలకు సాధ్యమైనంత త్వరగా అనుమతి లభిస్తుందని, ఎరువుల సరఫరాలో సరైన నిర్ణయం తీసుకుంటారని హామీ ఇచ్చారు. 2025 – 26 పంట కాలానికి సంబంధించి బోర్డు నిర్ణయించిన పరిమితి మేరే పొగాకును వేయాలని సూచించారు. ఒంగోలు ఆర్‌ఎం రామారావు, వేలం కేంద్ర మేనేజర్ రాజశేఖర్, రామాంజనేయులు, రైతు సంఘం నేతలు గాలి నరసప్పనాయుడు, ఆరికట్ల జనార్దన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

636 పొగాకు బేళ్ల విక్రయం

డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 636 బేళ్లను విక్రయించారని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 848 బేళ్లు రాగా, వీటిలో 636ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 75,475 కిలోల పొగాకును విక్రయించగా.. రూ.1,47,93,280 వ్యాపారం జరిగిందని వివరించారు. గరిష్ట ధర కిలో రూ.280.. కనిష్ట ధర రూ.159.. సగటు ధర రూ.196గా నమోదైందని తెలిపారు. పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

అయ్యో.. చిట్టితల్లి

- బకెట్లో ఉన్న నీటిలో పడి చిన్నారి మృతి

ఉలవపాడు: బకెట్లో ఉన్న నీటిలో పడి ఏడాది చిన్నారి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కరేడులో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. కరేడు ప్రభుత్వ వైద్యశాల పక్కన ఉన్న ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న కత్తి అంజి, ఆదిలక్ష్మి దంపతులకు ఏడాది వయస్సున్న పద్మజ కుమార్తె. బాలిక ఆడుకుంటూ బకెట్ వద్దకెళ్లి అందులో ఉన్న నీటిలో సాయంత్రం పడిపోయింది. విషయాన్ని తల్లిదండ్రులు ఆలస్యంగా గమనించారు. వెంటనే పక్కనే ఉన్న వైద్యశాలకు తీసుకెళ్లగా, అక్కడ నీరు కక్కించారు. మెరుగైన వైద్యం నిమిత్తం శింగరాయకొండలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందింది.



ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..



ఎండ ఉన్న సమయంలో వీఆర్సీ సెంటర్‌లో ఇదీ పరిస్థితి



వానలో వెళ్తూ..



వర్షానికి తడవకుండా..

ఓవైపు మండే ఎండలు.. ఒక్కసారిగా వాన

ఈ మధ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండ దెబ్బకు బయటకు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితులున్నాయి. అయితే గురువారం భిన్న వాతావరణం నెలకొంది. సాయంత్రం నెల్లూరు నగరంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మేమింతే.. మారమంతే..

ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్న డాక్టర్లు

- సమయపాలన పాటించని యూడీసీ, సీహెచ్‌ఓ
- లంచం ఇస్తేనే బిల్లులు చేస్తామంటున్న యూడీసీ
- హెల్త్ క్లినిక్‌కు ఇచ్చే మెయింటెనెన్స్ నుంచి రూ.4 వేలు వసూలు
- ఎమ్మెల్యే బంధువులమంటూ బెదిరింపులు

ఎమ్మెల్యే చుట్టమని ఒకరు.. ఆయన మా దగ్గరి బంధువు, ఇప్పుడే ఫోన్‌లో మాట్లాడాను. మా జోలికొస్తే మీ ఇష్టమని మరొకరు. ఇదీ మండలంలోని మాచవరం పీహెచ్‌సీ అధికారుల తీరు. విధులు సక్రమంగా నిర్వర్తించకుండా కింది స్థాయి సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఎవరెన్ని చెప్పినా మేము మారేది లేదంటూ విధులకు దుమ్మా కొడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కందుకూరు మండలంలో మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. 19 పంచాయతీలకు గానూ 13 సచివాలయాలు ఈ పీహెచ్‌సీ కింద ఉన్నాయి. 13 విలేజ్ హెల్త్ క్లినిక్‌లున్నాయి. వీరందరికీ పీహెచ్‌సీ డాక్టర్లే వైద్యం అందించాల్సి ఉంది. మాచవరం గ్రామానికి చుట్టుపక్కల ఉన్న కందుకూరు మండలంలోని గ్రామాలతోపాటు గుడ్లూరు మండలానికి చెందిన పరకొండపాడు, దప్పళంపాడు, గుళ్లపాళెం, దారకానిపాడు, ఉలవపాడు మండలం కింద ఉన్న బద్దిపూడి ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. 24 గంటల పనిచేసే పీహెచ్‌సీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఓపీలో ఉండాలి. ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు పీహెచ్‌సీలో ఓపీలో ఉండి రోగులను పరీక్షించాలి. మరొకరు 104 వాహనంలో వెళ్లాలి. కానీ రోజూ ఇద్దరిలో ఒకరు మాత్రమే ఆస్పత్రికి వస్తారు. మరొకరు దుమ్మా కొడతారు. విధుల్లో ఉన్న వ్యక్తే 104, పీహెచ్‌సీలో ఉన్నట్లు సిబ్బంది కవర్ చేస్తుంటారు. జి.మేకపాడులో జరిగే 104కి ఏడాది నుంచి ఒక్కసారి కూడా డాక్టర్ వెళ్లిన దాఖలాల్లేవని లేవని గ్రామస్తులు చెబుతున్నారు.

సాకులు చెబుతూ..

ఇక యూడీసీ రోజూ ఒంగోలు నుంచి వచ్చి వెళ్తుంటారు. వాస్తవానికి 9 నుంచి 4 గంటల వరకు విధుల్లో ఉండాలి. కానీ ఆమె పీహెచ్‌సీకి వచ్చే సమయం 11 గంటల తర్వాతే. ఇంకా రాలేదని ఎవరైనా ప్రశ్నిస్తే ట్రెజరీకి వెళ్లానని సాకులు చెబుతారు. కాసేపు మాత్రమే విధుల్లో ఉండి త్వరగా వెళ్లిపోతారు. ఏఎన్‌ఎంలు, అధికారులు పదవీ విరమణ చేసినా, బదిలీపై వెళ్లినా, పదోన్నతి పొందినా, సబ్ సెంటర్లకు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు బిల్లుల విషయంలో లంచం ఇవ్వాల్సిందేననే ఆరోపణలున్నాయి. వసూలు చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని డాక్టర్లకు కూడా ఇస్తున్నట్లు ప్రచారం ఉంది. కొందరికి బిల్లులు చేయకపోవడంతో ఇప్పటికీ పీహెచ్‌సీ చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం.



మాచవరంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం

ఆర్‌ఎంపీల వద్ద వసూళ్లు

కందుకూరు మండలం, పట్టణ పరిధిలో ఉండే ఆర్‌ఎంపీలు అనుమతి లేకుండా వైద్యం చేస్తున్నారని ఓ వైద్యుడు బెదిరించాడు. డబ్బులు ఇవ్వాలని హుకుం జారీ చేశాడు. దీంతో రెండునెలలపాటు ఆర్‌ఎంపీలందరూ కలిసి నగదు వసూలు చేసి డాక్టర్‌కు ఇచ్చారు. తర్వాత కొందరు ఇవ్వలేదు. వారిపై డాక్టర్ వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో చేసేది లేక ఆర్‌ఎంపీలు ఎమ్మెల్యేను కలిశారు. ఆ సమయంలో వైద్యుడిని ఎమ్మెల్యే మందలించినట్లు సమాచారం. కాగా విలేజ్ హెల్త్ క్లినిక్ మెయింటెనెన్స్‌కు ఏడాదికి రూ.10 వేలు ఇస్తారు. అందులో సుమారు రూ.4 వేలు డాక్టర్, యూడీసీ వసూలు చేసినట్లు తెలిసింది.

విధుల్లో లేకుండా..

సీహెచ్‌ఓ, పీహెచ్‌ఎన్, హెచ్‌వీ, సూపర్‌వైజర్లు వారి విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపణలున్నాయి. ఫీల్డ్‌లోకి వెళ్లాల్సిన హెచ్‌వీ, సూపర్‌వైజర్లు కింది స్థాయి సిబ్బందిపై పెత్తనం చేయడమే గానీ ప్రజలకు వైద్యం అందుతుందా? లేదా? అని పర్యవేక్షించడం లేదని చెబుతున్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలతో పని చేయించాల్సిన అధికారులు ఆ వైపు చూడటం లేదు. సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ హాజరు వేయాలి. డాక్టర్లు, కింది స్థాయి అధికారుల అండ ఉంటే ఎక్కడ ఉండైనా హాజరు వేసుకోవచ్చు. లేకపోతే ఆబ్సెంట్ పడుతుంది. కావాలనే ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆబ్సెంట్లు వేసి జీతాలు కట్ చేసిన సంఘటనలున్నాయి. ఫేస్ రికగ్నిషన్ హాజరు లేని వారు కచ్చితంగా జీపీఆర్‌ఎస్‌తో కూడిన ఫొటోను గ్రూపుల్లో పెట్టాలి. లేకపోతే ఆరోజు వారికి ఆబ్సెంట్ వేసి జీతం కట్ చేస్తున్నారు. ఇలా సిబ్బంది అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయాలను ఎవరైనా ఉన్నతాధికారులకు చెబితే కక్ష సాధింపునకు దిగుతున్నారు.

లారీని ఓవర్‌టేక్ చేయబోయి..

- హైవేపై రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే క్లీనర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రంగనాథ్‌గౌడ్

కోవూరు: మండలంలోని చెన్నై జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి విజయవాడకు ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు వెళ్తోంది. హోటల్ నెల్లూరు గ్రాండ్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి వేగంగా ఢీకొట్టింది. ఈ సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులున్నారు. వారికి గాయాలు కాలేదు. అయితే బస్సులో పనిచేస్తున్న క్లీనర్ నాని (30) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కోవూరు పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతివేగమే కారణమని, లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించిన సందర్భంలోనే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై రంగనాథ్‌గౌడ్ మాట్లాడుతూ కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

- కందుకూరు సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్

కందుకూరు: పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. కందుకూరు మున్సిపాలిటీ, మండలానికి సంబంధించిన బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం పామూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. చంద్రబాబుకు ఓటు వేసి పూర్తిగా మోసపోయామని ప్రస్తుతం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. బాబు చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసే కార్యకర్తలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేలా పదవులు ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు షేక్ రఫీ, ఈదర రమేష్, నాయకులు తోకల కొండయ్య, వల్లూరి కోటేశ్వరరావు, రావులకొల్లు బ్రహ్మానందం, గేరా మనోహర్, పాశం కొండయ్య, ముప్పవరపు కిశోర్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన బుర్రా, ఇతర నాయకులు

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైమ్): నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లు వినియోగిస్తే చర్యలు తప్పవని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి వాహనదారులను హెచ్చరించారు. గురువారం సౌత్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 25 ద్విచక్ర వాహనాలకు అమర్చిన అధిక శబ్దం చేసే సైలెన్సర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు, తోటి వాహనచోదకులకు అసౌకర్యం కలిగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లు వినియోగించరాదని ద్విచక్ర వాహనదారులకు సూచించారు. వాహనానికి కంపెనీ ఇచ్చిన సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చేవి బిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తరహా సైలెన్సర్లు విక్రయించేవారు, బిగించే మెకానిక్‌లపై సైతం చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఐ చంద్రమౌళి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ సమీపంలో తొలగించిన సైలెన్సర్లను పరిశీలిస్తూ..

మోసం చేయడం చంద్రబాబు నైజం

- వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- చాగణంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

సైదాపురం: 'ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య' అని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాగణం కల్యాణ మండపంలో మండల కన్వీనర్ రవికుమార్ యాదవ్ అధ్యక్షతన గురువారం బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల జోలికొస్తే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సైదాపురం మండలంలో కార్యకర్తలపై వేధింపులు ఎక్కువవుతున్నాయని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. చంద్రబాబు తన కార్యకర్తలు, నాయకులకు దోచిపెడుతున్నారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం మాటున రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఇంకా నేతలు కంభం విజయభాస్కర్‌రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. కార్యక్రమంలో గుంటమడుగు శ్రీనివాసులురాజు, కమలపూడి సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

ఫోన్లు చోరీ చేస్తూ.. తప్పించుకు తిరుగుతూ..

- పాతనేరస్తుడి అరెస్ట్ • 40 సెల్‌ఫోన్ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): రైళ్లలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ పాతనేరస్తుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. గూడూరు పట్టణానికి చెందిన కె.అఖిల్ అలియాస్ వెంకటరమణయ్య పాతనేరస్తుడు. అతను రైళ్లలో ప్రయాణికుల సెల్‌ఫోన్లను చోరీ చేసేవాడు. ఇటీవల ఫోన్ దొంగతనాలు అధికమయ్యాయి. రైల్వే సీఐ ఎ.సుధాకర్ నేతృత్వంలో నెల్లూరు, గూడూరు ఎస్సైలు హరిచందన, చెన్నకేశవలు, సీఐ ఐడీ పార్టీ సిబ్బంది నేరాల కట్టడికి చర్యలు చేపట్టారు. బుధవారం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో అఖిల్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని గూడూరుకు తరలించారు. విచారించగా సెల్‌ఫోన్లను చోరీ చేసినట్లు నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. సుమారు రూ.3 లక్షల విలువైన వివిధ కంపెనీలకు చెందిన 40 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని రైల్వే డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన సీఐ, ఎస్సైలు, ఐడీ పార్టీ సిబ్బంది కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రవి, జయప్రకాష్‌ను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీధర్

- రైళ్లలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు జువనైల్స్‌ను నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన అదుపులోకి తీసుకున్నారు. రూ.70 వేల విలువైన రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని జువనైల్ హోంకు తరలించారు.

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన కావలి డీఎస్పీ శ్రీధర్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

ఉదయగిరి: ఆస్తి వివాదంలో షేక్ హమీద్ అనే వ్యక్తిని హత్య చేసిన నిందితులు షేక్ గుంటుపల్లి మహ్మద్ హనీఫ్, షేక్ గుంటుపల్లి మహ్మద్ ఉమర్‌ను గురువారం అరెస్ట్ చేశారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీధర్ వివరాలు వెల్లడించారు. ఉదయగిరిలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాలు భాగస్వామ్యానికి సంబంధించి ఆర్థిక లావాదేవీల విషయంలో హమీద్‌తో నిందితులకు రెండేళ్ల నుంచి విభేదాలున్నాయి. నెల్లూరు కోర్టులో హనీఫ్ దాఖలు చేసిన సివిల్ కేసు నడుస్తోంది. ఈనెల 11వ తేదీ సాయంత్రం హమీద్ తన బావమరిది, మరికొందరు కలిసి ఫంక్షన్ హాలు తలుపులకు తాళం వేశారు. ఈ విషయం తెలుసుకున్న హనీఫ్, ఉమర్‌లు హమీద్‌ను చంపి హాలును సొంతం చేసుకోవాలని ప్లాన్ చేశారు. స్కూటీపై అక్కడికెళ్లి హనీఫ్ కత్తితో, ఉమర్ ఇనుపరాడ్డుతో హమీద్‌పై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హతుడి తండ్రి షేక్ ఇమాం గారి ఖాజామొహిద్దీన్ 12వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ పర్యవేక్షణలో ఉదయగిరి సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు దర్యాప్తు చేపట్టారు. వారికి వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దుత్తలూరు మండలం వెంకటంపేట హుస్సేని బీఈడీ కాలేజీ వద్ద నిందితులను అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డు, కత్తి, ఇంకా సెల్‌ఫోన్లు, పారిపోయేందుకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్సైలు, సిబ్బంది హనుమంతరావు, ఎం.గోవిందు, బి.ప్రసన్నకుమార్, కె.అశోక్, కె.ప్రసాద్, ప్రశాంత్, ఎ.ప్రభాకర్, ఎన్.ఉమేష్, ఎ.నరసింహారావు, ఎస్‌కే ఖాజాపీర్‌ను డీఎస్పీ అభినందించారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి..

- డ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో మినీ కంటైనర్

దగదర్తి: మండలంలోని సున్నపుబట్టి జాతీయ రహదారి సమీపంలో జామాయిల్ ఫారెస్ట్ వద్ద నెల్లూరు వైపు వెళ్తున్న మినీ కంటైనర్ గురువారం గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కంటైనర్ ముందు భాగం దెబ్బతినడంతో డ్రైవర్ పన్నీర్ సెల్వం (50) తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హైవేపై ట్రాఫిక్ నిలిచిపోకుండా వెంటనే చర్యలు చేపట్టారు. సెల్వంను అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

కోడూరు కాలువలో మృతదేహం

తోటపల్లిగూడూరు: మండలంలోని చింతోపు పంచాయతీ ఆంజనేయపురం సమీపంలో ఉన్న కోడూరు కాలువలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు తోటపల్లిగూడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. వంగపూత కలర్ షర్ట్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై మల్లీశ్వరి అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	116
లేయర్ (లైవ్)	112
బ్రాయిలర్ చికెన్	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	234
లేయర్ చికెన్	190

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.25
సన్నవి	రూ.15
పండ్లు	రూ.5